

కాకులారంలో ఎమ్మెల్యే ప్రసంగాన్ని వింటున్న గ్రామస్తులు

పరుమాలలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండ్ల

## నాటి దుస్థితికి

# కాంగ్రెస్సే కారణం

- తెలిసి పొరపాటు చేస్తే భవిష్యత్ అంధకారమే..
- సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శం
- పార్టీలకతీతంగా అన్ని వర్గాలకు న్యాయం
- ప్రజలు ఆలోచించి అభివృద్ధికి పట్టం కట్టాలి
- ఆరు గ్యారెంటీలు, అరవై అబద్ధాలతో పల్లెల్లోకి వచ్చే పగటి వేషగాళ్ల తో తస్మాత్ జాగ్రత్త
- ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి
- గద్వాల మండలంలో విస్తృత ప్రచారం

గద్వాల రూరల్, నవంబర్ 8 : తెలంగాణ దశాబ్దాల దుస్థితికి కారణం కాంగ్రెస్సేనని, కారు గుర్తుకు ఓటు అభివృద్ధికి మలుపని గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి స్పష్టం చేశారు. హస్తం పార్టీ ఎన్ని కట్టలు పంచినా గెలుపు కారుదేనని ధీమా వ్యక్తం చేశారు. బుధవారం మండలంలోని కాకులారం, పరుమాల గ్రామాల్లో ప్రచారంలో భాగంగా బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కృష్ణమోహన్‌రెడ్డి పర్యటిస్తూ అభివృద్ధి, సంక్షేమ పథకాలు, మ్యానిఫెస్టోను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా సర్పంచులు, మహిళలు, బీఆర్‌ఎస్ నాయకులు శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి గజమాలతో స్వాగతం పలికారు. ఈక్రమంలో ఎమ్మెల్యే పలు చర్చీల్లో ప్రార్థనలు చేసి మాట్లాడారు. గతంలో ఎన్నడూ లేని విధంగా బీఆర్‌ఎస్ పాలనలో పల్లెలు అన్ని విధాలా అభివృద్ధి చెందాయన్నారు. చరిత్రలో నిలిచిపోయేలా గ్రామాలు ప్రగతి సాధించాయని, సంక్షేమ పథకాలను అమలు చేస్తూ దేశంలోనే రాష్ట్రాన్ని మొదటి స్థానంలో నిలిపిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందన్నారు. పార్టీలకు అతీతంగా అన్ని వర్గాలకు న్యాయం చేస్తున్న ఏకైక ప్రభుత్వం బీఆర్‌ఎస్ అని తెలిపారు. ఎన్నికల వేళ కొంతమంది పగటి వేషగాళ్లు కల్లబొల్లి మాటలు చెప్పడానికి పల్లెల్లోకి వస్తున్నారని వారితో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. 50 ఏండ్లలో చేయలేని పనులు ఇప్పుడు చేస్తామంటూ 6 గ్యారెంటీలు.. 60 అబద్ధాలు చెప్పడానికి వస్తున్నారని, ప్రజలు వారిని గమనించాలన్నారు. పోరాడి సాధించుకున్న రాష్ట్రం మరింత అభివృద్ధి చెందాలంటే హ్యాట్రిక్ సీఎంగా కేసీఆర్‌ను, మరోసారి తనను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. మ్యానిఫెస్టోలో ఆసరా పింఛన్లు, రైతుబంధు పెంపుతోపాటు మహిళల కోసం ప్రత్యేక స్కీంలు ప్రకటించారని, అర్హులైన మహిళలకు నెలనెలా జీవన భృతి, పేద మహిళలకు రూ.400కే గ్యాస్ సిలిండర్ అందిస్తామన్నారు. తెల్లకార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ రూ.5లక్షల జీవిత బీమా ఇస్తామన్నారు. కాంగ్రెస్, బీజేపీ పార్టీల నాయకుల కుట్రపూరితమైన మాటలు నమ్మొద్దన్నారు. ఈనెల 30న జరిగే ఎన్నికల్లో ప్రజలు ఆలోచించి అభివృద్ధి చేసే వారికే ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా డైరెక్టర్ సుభాన్, ఎంపీపీ ప్రతాప్‌గౌడ్, మార్కెట్‌యార్డు వైస్‌చైర్మన్ సంజీవులు, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు అశోక్‌రెడ్డి, సర్పంచ్ పావని, మన్యం, ఎంపీటీసీ సువర్ణమ్మ, బీఆర్‌ఎస్ నాయకులు రమేశ్‌నాయుడు, మహేశ్వర్ రెడ్డి, నీలేశ్వర్‌రెడ్డి, రాధాకృష్ణారెడ్డి, రాంచందర్, వెంకటన్న, ఆంజనేయులు, కురుమన్న, సత్యనారాయణ, వేణు, పురుషోత్తంరెడ్డి, ప్రవీణ్, భీమేశ్ రెడ్డి, బీచుపల్లి తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్‌ఎస్‌తోనే అన్ని వర్గాలకు న్యాయం

- ప్రత్యేక నిధులతో ప్రగతి పథంలో పల్లెలు
- నియోజకవర్గ అభివృద్ధికి సహకరించండి
- కారు గుర్తుకే ఓటు వేసి ఆశీర్వదించాలి
- బీఆర్‌ఎస్ అలంపూర్ ఎమ్మెల్యే అభ్యర్థి విజయుడు
- ఉండవెల్లి, మానవపాడు, రాజోళి మండలాల్లో విస్తృత ప్రచారం



ప్రచారంలో భాగంగా మానవపాడు మండలం జల్లాపురం గ్రామంలో వృద్ధురాలిని ఓటు అభ్యర్థిస్తున్న బీఆర్‌ఎస్ అభ్యర్థి విజయుడు

రాజోళి, నవంబర్ 8 : అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తూ బీఆర్‌ఎస్ ప్రభుత్వం పేదలకు అండగా నిలిచిందని అలంపూర్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ అభ్యర్థి విజయుడు స్పష్టం చేశారు. మరింత అభివృద్ధి జరగాలంటే మరోసారి కారుగుర్తుకు ఓటు వేసి తనను గెలిపించాలని ప్రజలను అభ్యర్థించారు. బుధవారం రాజోళిలో ప్రధాన వీధుల్లో తిరుగుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించారు. కారు గుర్తుపై ఓటు వేసి నియోజక అభివృద్ధికి సహకరించాలని కోరారు. ప్రత్యేక నిధులు మంజూరు చేయడంతో పల్లెలు ప్రగతి పథంలో పయనిస్తున్నాయన్నారు. ఇంత చేసిన సీఎం కేసీఆర్‌కు అందరం అండగా ఉంటూ కారు గుర్తుకు ఓటు వేయాలన్నారు. తెలంగాణలో అన్ని వర్గాలకు సమన్యాయం చేస్తూ పథకాలను అందించిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. బీఆర్‌ఎస్‌కు ఓటు వేస్తే ప్రజల మధ్యలో ఉండను అని అంటున్న కాంగ్రెస్ నాయకుల ఝూటా మాటలు నమ్మొద్దని, ప్రజల మధ్యలో ఉంటూ వారి సమస్యల కోసం నిరంతరం ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి సహకారంతో కృషి చేస్తానని స్పష్టం చేశారు. బీఆర్‌ఎస్ అభ్యర్థికి ప్రజలు పెద్ద ఎత్తున బ్రహ్మరథం పడుతూ ప్రచారంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ ముఖ్య నేతలు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

**జల్లాపురంలో..**

మానవపాడు, నవంబర్ 8 : మండలంలోని జల్లాపురం గ్రామంలో విజయుడు తన అనుచరులతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అబివృద్ధి పనులను ప్రజలకు వివరిస్తూ కారు గుర్తుపై ఓటు వేసి ఆశీర్వాదించాలని కోరారు. ముఖ్యమంత్రి కేసీఆర్, ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి ఆశీర్వాదంతో ప్రజలకు సేవ చేసే అవకాశం వచ్చిందని, తనను ఆశీర్వదించాలని కోరారు. తాను కూడా పేదింటి బిడ్డనే అని, ప్రతి ఇంటికీ తెలంగాణ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అందేలా చూస్తాను.. ఆదరించండని కోరారు. ఆయన వెంట నాయకులు శేషిరెడ్డి, ఎంపీపీ అశోక్ రెడ్డి, వైస్ ఎంపీపీ సోమన్నగౌడ్ తదితరులున్నారు.

**మారమునగాల-1లో..**

ఉండవెల్లి, నవంబర్ 8 : మండలంలోని మారమునగాల-1 గ్రామంలో బీఆర్‌ఎస్ అభ్యర్థి కే.విజయుడు, పార్టీ సీనియర్ నాయకులతో కలిసి బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికీ వెళ్లి బీఆర్‌ఎస్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ కారు గుర్తుపై ఓటు వేసి అత్యధిక మోజార్టీతో గెలిపించాలని కోరారు. ఆయన వెంట పీఏసీసీఎస్ చైర్మన్ గజేందర్‌రెడ్డి, ఆలయ కమిటీ మాజీ చైర్మన్లు రవిప్రకాశ్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీ కురుమూర్తి, సర్పంచ్ శివనారాయణ, మత్స్యకారుల సంఘం జిల్లా అధ్యక్షుడు గోపాల్, మాజీ సర్పంచ్ ఈరన్న గౌడ్, బీఆర్‌ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

**జోగుళాంబ సన్నిధిలో..**

అలంపూర్, నవంబర్ 8 : జోగుళాంబ, బాలబ్రహ్మేశ్వర స్వామి ఆలయాలను బీఆర్‌ఎస్ అలంపూర్ ఎమ్మెల్యే అభ్యర్థి విజయుడు బుధవారం దర్శించుకున్నారు. బీ ఫాం అందుకున్న సందర్భంగా ఆలయాల్లో పూజలు చేయగా వారికి ఆలయ పాలక మండలి చైర్మన్ చిన్న కృష్ణయ్యనాయుడు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఉభయ ఆలయాల్లో బీఫాంను అమ్మ వారి చెంత ఉంచి పూజలు చేశారు. అనంతరం పట్టణంలోని షా-అలీ పహిల్వాన్ దర్గాలో, న్యూప్లాట్స్ కాలనీలోని చర్చిలోనూ ప్రార్థనలు నిర్వహించారు. వారి వెంట బీఆర్‌ఎస్ నాయకులున్నారు.

## కల్లబొల్లి మాటలు

# నమ్మొద్దు

- కాంగ్రెసోళ్లను నమ్మితే మోసపోతరు
- ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి



బీఆర్‌ఎస్‌లో చేరిన వారితో ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

గద్వాల, నవంబర్ 8 : కాంగ్రెస్ నాయకుల కల్లబొల్లి మాటలు నమ్మి ఆ పార్టీకి ఓటు వేస్తే మోసపోతారని, గద్వాల నియోజకవర్గాన్ని ఎవరు అభివృద్ధి చేస్తారో ఆలోచించి వారికే ఈ ఎన్నికల్లో సహకరించాలని ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి కోరారు. బుధవారం జిల్లా కేంద్రంలోని క్యాంప్ కార్యాలయంలో జమ్మిచేడ్‌కు చెందిన బీజేపీ, కాంగ్రెస్ నాయకులు 150మంది బీఆర్‌ఎస్‌లో చేరారు. మల్దకల్ మండలం అమరవాయి గ్రామానికి చెందిన జగదీశ్వర్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, రాజారెడ్డి, రామకృష్ణారెడ్డి, జయన్న, రామకృష్ణ, ఆనంద్, జయరాములు, దాసుతోపాటు మరికొందరు, 19వ వార్డుకు చెందిన 50మంది, ధరూర్ మండలం కొత్తపాలెం గ్రామానికి చెందిన చిన్నప్ప, జయప్ప, ఆంజనేయులు, కొండన్న, నరేశ్, నాగరాజు, గోవిందుతోపాటు 20మంది, గద్వాల మండలం రేకులపల్లికి చెందిన రాముడు, శివరాజు, శ్రీనివాసులు, బాలు, మోహన్, కృష్ణ, సోమేశ్, కురుమూర్తి, గంగాధర్, మొగులన్న, వెంకట్, బీసన్నతోపాటు 60మంది, మల్దకల్‌కు చెందిన తిరుమల్‌రెడ్డి, దామోదర్, రాధాకృష్ణ, చిన్నరాములు, నవీన్, తిరుమలేశ్‌తోపాటు 50మంది, ధరూర్ మండలం బీజేపీ సింగిల్‌విండో డైరెక్టర్ మరియమ్మతో పాటు శాంతమ్మ, మోజేశ్, కుప్పమ్మ, భీమన్న, అబ్రహం, రవి, శాంతన్నతోపాటు 100మంది బీఆర్‌ఎస్‌లో చేరగా వారికి ఎమ్మెల్యే గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ నాయకులు ప్రజలకు అమలు కాని హామీలు ఇస్తున్నారని, వారితో అప్రమత్తంగా ఉండాలన్నారు. గద్వాల నియోజకవర్గంలోని ప్రజలు ప్రస్తుతం అన్నదమ్ముళ్ల లాగా కలిసి ఉన్నారని, కాంగ్రెస్ నాయకులు కుల చిచ్చు పెడుతున్న విషయాన్ని గ్రహించాలన్నారు. కర్ణాటకలో ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడంతో అక్కడి నాయకులు, ప్రజలు తిరుగుబాటుకు సిద్ధమయ్యారని గుర్తు చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ప్రజలకు భద్రత ఉండదన్నారు. ఈనెల 30న జరిగే ఎన్నికల్లో ప్రజలు ఆలోచించి ఓటు వేయాలని సూచించారు.

- కుట్రలకు తెరలేపుతున్న హస్తం నేతలు
- సీఎం కేసీఆర్ పాలనలోనే అభివృద్ధి
- నారాయణపేట ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి

## కాంగ్రెస్‌ను నమ్మితే నట్టేట ముంచుడే..

కోయిలకొండ, నవంబర్ 8 : కాంగ్రెస్‌ను నమ్మి ఓట్లు వేసి గెలిపిస్తే కర్ణాటకలో ప్రజలను నట్టేట ముంచారని, తెలంగాణ ప్రజలను కూడా నాశనం చేసేందుకు కుట్రలు చేస్తున్నారని నారాయణపేట ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని కొత్లాబాద్, మల్లాపూర్, సురారం, బూర్గుపల్లి గ్రామాల్లో విస్తృత ప్రచారం నిర్వహించి మాట్లాడారు. తెలంగాణలో అందిస్తున్న 24గంటల విద్యుత్‌తో రైతులు సంతోషంతో వ్యవసాయం చేస్తున్నారని, పక్కన ఉన్న కర్ణాటకలో 5గంటలు కూడా విద్యుత్ ఇవ్వడం లేదన్నారు. పదేండ్లలోనే ఊహించని అభివృద్ధి చేశామని, కాంగ్రెస్ ఓర్వలేక ప్రజలను మభ్యపెట్టేందుకు ప్రయత్నిస్తున్నదన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చే వాగ్దానాలను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని, 60ఏండ్లు నమ్మి ఎంతో గోసపడ్డామన్నారు. పదేండ్లలోనే బీఆర్‌ఎస్ హయాంలో ఊహించని అభివృద్ధి చేసి అన్నివర్గాల ప్రజలకు అండగా నిలిచామన్నారు. నియోజకవర్గంలో ప్రతి ఎకరాకు సాగునీరు అందివ్వడమే ప్రధాన లక్ష్యమని, ఆ కల త్వరలో సాకారం కానున్నదన్నారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం ద్వారా జిల్లాను సస్యశ్యామలం చేస్తామన్నారు.

**బీఆర్‌ఎస్‌లో చేరికలు..**

మండలంలోని ఆచార్యపూర్‌లో కాంగ్రెస్ పార్టీకి చెందిన యువకులు ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ సమన్వయకర్త ఎస్.రవీందర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు బి.కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.